కనెక్షన్‌కో రేటు!

రోడ్డుకి అవతలైతే రూ.1000... రోడ్డుకి ఇవతలైతే రూ.800



శ్రీరామ్‌నగర్‌లో ఇళ్లకు నీటి కనెక్షన్ల కోసం తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

తాగునీటి కనెక్షన్ల అంగట్లో సరుకుగా మారింది. నీటి కనెక్షన్ల మార్పిడి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో వినియోగదారులను నుంచి అందిన కాడికి దోచుకుంటున్నారు. ఒక కనెక్షన్ మార్చేందుకు ఒక్కో రేటు ఫిక్స్ చేశారంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక వారు డిమాండ్ చేసినంత ఇవ్వాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. వాటర్ వర్క్స్ అధికారుల అండదండలు లేకుండా వాళ్లు ఇలా వ్యవహరించరని చెబుతున్నారు. మరి వాటర్స్ వర్క్స్ ఉన్నతాధికారులు దీనిపై స్పందిస్తారో లేదో వేచి చూడాలి.

చింతల్: తాగునీటి ఎద్దడిలో భాగంగా కుత్బుల్లాపూర్ జలమండలి డివిజన్ పరిధిలో రూ.220 కోట్లతో సుమారు వెయ్యి కిలోమీటర్ల మేర గోదావరి పైపులైన్‌లు వేసినా అనేక బస్తీలు, కాలనీలకు నీటి సరఫరా లేకుండా పోయింది. 2019లో జీఎంగా శ్రీధర్‌రెడ్డి ఇక్కడికి వచ్చిన అనంతరం మరో రెండు వందల కిలోమీటర్ల మేర ప్రత్యేక నిధులతో కుత్బుల్లాపూర్‌లోని బస్తీలు, కాలనీలకు నూతన పైప్ లైన్‌ల ప్రపోజల్ పెట్టగా విడుదల వారీగా పూర్తి చేపడుతూ వస్తున్నారు. మెగా ఇంజినీరింగ్ కంపెనీ పైపులైన్‌కి అప్పగించగా పైపులైన్ పనులను చేపడుతున్నారు. ఈ పూర్తి చేసిన ప్రాంతాల్లో ఇంటింటికి కొత్త పైపులైన్ మార్చేందుకు జలమండలి ప్రధానంగా షిఫ్టింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ నిధుల లేమితో కాస్త ఆలస్యం కాగా వినియోగదారులు వాటర్ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

◆ ఇదే అదనుగా భావించిన కొంతమంది మధ్యవర్తులు సెక్షన్ మేనేజర్, సిబ్బందితో కుమ్మక్కై ప్రైవేట్ వ్యక్తులచే పైప్‌లైన్ షిఫ్టింగ్ చేసే పనులను చేపట్టారు. దీంతో వినియోగదారులు నిండా మునుగుతున్నారు. ఒక్కో కనెక్షన్ మార్చేందుకు సదరు మధ్యవర్తి ఒక ఇంటికి రోడ్డు వైపు కనెక్షన్ ఉంటే రూ.800, అవతలి వైపు ఉంటే రూ.1000 చొప్పున వసూలు చేస్తూ అధికారులు, సిబ్బంది లేకుండానే కనెక్షన్ల మార్పిడి జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

అక్రమ షిఫ్టింగ్ కనెక్షన్లు జరిగేది ఇక్కడే..

ఉషోదయ సెక్షన్ పరిధిలో శ్రీరామ్‌నగర్‌లో మెగా ఇంజినీరింగ్ సంస్థ పురాతన పైపులైను స్థానంలో హెచ్‌డీపీఈ పైప్‌లైన్ వేశారు. ఈ పైపులైన్లకు నూతన కనెక్షన్లు ఇచ్చేందుకు సాధారణంగా జలమండలి టెండర్లను పిలిచి 15 కనెక్షన్లు చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ షిఫ్టింగ్ కనెక్షన్లు చేపట్టకపోవడంతో స్థానికులు పలుమార్లు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసిన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇదే ఎదురుగా భావించిన కొంతమంది మధ్యవర్తులు షిఫ్టింగ్ కనెక్షన్లను ఇంటింటికి ఒక రేటు మాట్లాడుకుని చకచక పనులు మొదలు పెట్టాడు. నిబంధనలకు విరుద్ధంగా గత కొన్ని రోజులుగా ఈ షిఫ్టింగ్ కనెక్షన్లు చేస్తున్నప్పటికి పట్టించుకోవాల్సిన సెక్షన్ మేనేజర్, సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదని చెబుతున్నారు.

మా జేబులు గుల్ల చేస్తున్నారు...



శ్రీరామ్‌నగర్‌లో సుమారు 300 కనెక్షన్లు పైగా ఉన్నాయి. ఇక్కడ కొత్త పైపులైను వేసి వాటిని మార్చే విషయం మరిచారు. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాము పలుమార్లు మేనేజర్ ఝాన్సీకి విన్నవించగా సిబ్బందిని పంపిస్తామని చెప్పి వెళ్లిపోయింది. అనంతరం ఓ వ్యక్తి తనను మేడం పంపిందని పేర్కొంటూ ఇంటింటికి ఒక రేటు చొప్పున డబ్బులు ఇస్తే కనెక్షన్లను బదిలీ చేస్తామని చెప్పాడు. ఇలా ఒక్కో ఇంటి నుంచి రూ.800 ఒకవైపు, మరో వైపు రూ.1000 వసూలు చేసే కనెక్షన్లను మారుస్తున్నాడు. పది మీటర్లు దూరం లేకపోయినా కనెక్షన్‌ను మార్చేందుకు రూ.వెయ్యి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

– పెంటమ్మ, శ్రీరామ్‌నగర్

ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నాం...



మా బస్తీలో పైపులైన్లు వేసి ఏడాది అయ్యింది. ఇప్పటికీ కనెక్షన్లు మార్చలేదు. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పుడు ఒక వ్యక్తి వచ్చి ఇంటికి రూ.వెయ్యి ఇవ్వండి నేనే తవ్వి కనెక్షన్ మారుస్తాను అంటూ పనులు మొదలు పెట్టాడు. చాలా ఎక్కువ అడుగుతున్నారు మీరు అంటూ మేము ఎన్నిసార్లు చెప్పినా సదరు వ్యక్తి మాత్రం రేటు తగ్గించ లేదు. దీంతో మాకు చెల్లించక తప్పలేదు. ఇంటికి రూ.వెయ్యి ఇచ్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తడం చాలా దురదృష్టకరం.

– ఈశ్వరయ్య, శ్రీరామ్‌నగర్

క్లుప్తంగా

ఆర్థిక సాయం

రంగారెడ్డినగర్: పక్షవాతంతో బాధపడుతూ ఇంటికి పరిమితమైన ఆటో డ్రైవర్ కుటుంబానికి గాంధీనగర్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు, టెక్ ట్రాన్స్‌ఫార్మర్స్ అధినేత స్వామిగౌడ్ బాసటగా నిలిచారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సత్యనారాయణకు సంవత్సరం క్రితం పక్షపాతం రావడంతో అతని కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. పిల్లల స్కూల్ ఫీజులు సైతం చెల్లించలేని నిస్సహాయ స్థితిలో ఉండటంతో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మీనాథ్ ఈ విషయాన్ని స్వామిగౌడ్ దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో స్పందించిన ఆయన గురువారం బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

మందలించారని చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య

జీడిమెట్ల: జులాయిగా తిరుగుతున్నావని తల్లి దండ్రులు మందలించడంతో ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన శరనప్ప కుమారుడు పవన్ అలియాస్ రాము (19) జులాయిగా తిరుగుతున్నాడు. ఈ విషయమై గురువారం తల్లిదండ్రులు పవన్‌ను మందలించారు. దీంతో ఉదయం పవన్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మధ్యాహ్నమైనా పవన్ ఇంటికి రాలేదు. దీంతో అతడికి ఫోన్ చేయడంతో స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పవన్ చింతల చెరువు వైపు వెళ్లినట్లు గుర్తించారు. చెరువు వద్ద గాలించగా పవన్ మృతదేహం లభించింది.

వృద్ధుడి అదృశ్యం

నిజాంపేట్: బ్యాంక్‌కు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతినగర్‌కు చెందిన మాధవరావు (62) ఈనెల 12న ఉదయం 10 గంటల ప్రాంతంలో స్థానికంగా ఉన్న బ్యాంక్‌కు లావాదేవీల నిమిత్తం వెళ్లాడు. కాగా రాత్రైనా ఇంటికి తిరిగి రాకపోయేసరికి ఆందోళన చెందిన కుటుంబసభ్యులు అతని కోసం చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో గురువారం బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కూలి మృతి

కుత్బుల్లాపూర్: కూలి పనుల కోసం వచ్చిన వ్యక్తికి గుండెపోటు రావడంతో మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైసమ్మగూడలోని మహేంద్రరెడ్డి అనే వ్యక్తి నూతనంగా చేపట్టిన ఇంటి నిర్మాణ పనుల్లో లేబర్‌గా పనిచేసేందుకు గురువారం గండిమైసమ్మ నుంచి ఓ వ్యక్తి వచ్చాడు. అయితే మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో అతనికి గుండెనొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అతన్ని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

జీడిమెట్ల: పరిశ్రమలో పని చేస్తుండగా కింద పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది. సీఐ వివరాల ప్రకారం.. హెచ్‌ఏఎల్ రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డి(50) 23 సంవత్సరాలుగా జీడిమెట్లలోని విర్కో పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 5వ తేదీన ఉదయం రోజు మాదిరిగానే శ్రీనివాస్‌రెడ్డి డ్యూటీకి వెళ్లాడు. 11గంటల సమయంలో 20ఫీట్ల ఎత్తులో రేకులపై నిలబడి పనిచేస్తున్నాడు. ఒక్కసారిగా ప్రమాదవశాత్తు రేకులు విరిగడంతో శ్రీనివాస్‌రెడ్డి కిందపడిపోయాడు. ఈ ఘటనలో శ్రీనివాస్‌రెడ్డి నడుము, కుడి చేయి బొటనవ్రేలికి గాయాలయ్యాయి. వెంటనే పరిశ్రమ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డిని చికిత్స నిమిత్తం కొంపల్లిలోని శ్రీకర ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈనెల 7వ తేదీన వైద్యులు కుడిచేయి, బొటనవ్రేలికి చికిత్స నిర్వహించారు. అక్కడే చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌రెడ్డి బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుని భార్య జమునరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై స్పందించిన అధికారులు

జగద్గిరిగుట్ట: భూదేవి హిల్స్, పరికి చేరువులో అక్రమ నిర్మాణాలపై గురువారం ప్రచురించిన పరికి చెరువు పూడ్చి అక్రమ నిర్మాణం శీర్షికకు అధికారులు స్పందించారు. ఆర్ఐ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో రెండు బేస్మెంట్‌లను తొలగించారు. మరిన్ని నిర్మాణాలను కూల్చివేసే సమయంలో స్థానికుల నుంచి ఒత్తిడి రావడంతో ఆర్ఐ, ఎమ్మార్వోకి ఫోన్ చేశారు. సర్వేయర్‌ను పిలిపించుకొని మిగతా నిర్మాణాలను కూల్చివేయమని ఎమ్మార్వో ఆదేశించారు. సర్వేయర్ స్పందించకపోవడంతో అధికారులు వెనుతిరిగారు. ఇలా ఈ నిర్మాణాను తూతూ మంత్రంగా కూల్చివేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ చెరువు కబ్జాను ఎలా కాపాడుతారో వేచి చూడాలి.

శంభీపూర్ రాజును కలిసిన ఉద్యమకారులు



దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కార ద్యేయంగా పనిచేస్తానని శాశనమండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ఆయా అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

◆ ఉద్యమకారుల వేదిక ఆద్వర్యంలో శంభీపూర్ రాజును కలిసి డబుల్ బెడ్‌రూం, రెండు వందల గజాల స్థలం ఇవ్వాలని విన్నవించారు.

◆ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తద్వార తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

◆ కార్యక్రమంలో ఉద్యమకారుల వేదిక తరపున అశోక్‌రెడ్డి, గుమ్మడి మధుసూదన్‌రాజు, కృష్ణారెడ్డి, సామల వెంకటేష్, సలీం, రాంరెడ్డి, నాగిరెడ్డి, జానయ్య, లక్ష్మారెడ్డి, జెస్సీ, శంకర్, సుధాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

◆ శ్రీభసవేశ్వరస్వామి జయంతి వేడుకలను హాజరుకావాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 23వ తేదీన సుభాష్ నగర్‌లో నిర్వహించే వేడుకలకు రావాలని డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, అడప శేషు, అడప శేకర్, శంకర్, సంఘం సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

నిజాంపేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన నిర్వహిస్తున్నాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి రాజీవ్‌గృహకల్పలో ఆయన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ హాథ్ సే హాథ్ జోడో యాత్ర సందేశాన్ని ప్రజలకు తెలియపరిచారు. అనంతరం భూపతిరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. అధికారంలోకి రాగానే గతంలో కొనసాగించిన సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు సదానందం, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు వొంపుగూడేం రాజీరెడ్డి, ఫిషర్మన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పోషీ మహేష్, ఓబీసీ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ భరత్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం

ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న సంక్షేమ సంఘాత ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని, సీఎం కేసీఆర్ ఆ దిశగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా గురువారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్, సాయినగర్ కాలనీల్లో పాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా 90 శాతం మేర అభివృద్ధి పనులు చేపట్టడంలో కృషి చేసిన ఎమ్మెల్యేను కాలనీవాసులు సత్కరించారు. అనంతరం వివేకానంద్ మాట్లాడుతూ.. గతంలో అనేక సమస్యలతో కొట్టుమిట్టాడిన ప్రాంతాల్లో నేడు మౌలిక వసతులు మెరుగుపర్చామని అన్నారు. ప్రజలకు ఏ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

◆ తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ అధికారులు ఎమ్మెల్యేను చింతల్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీలలో జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ వద్ద నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యేతో ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ సుధాకర్‌రావు, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ సైదులు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుభాష్‌రెడ్డి, ఫైర్‌మెన్ చాంద్ పాషా, జగదీష్, హోంగార్డ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీ బర్డ్ పథకానికి విశేష స్పందన



కుత్బుల్లాపూర్: ఎర్లీ బర్డ్ పథకం కింద గ్రేటర్ హైదరాబాద్ అధికారులు కల్పించిన వెసులుబాటును కుత్బుల్లాపూర్ సర్కిల్ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. సుభాష్‌నగర్, జీడిమెట్ల, రంగారెడ్డి నగర్, కుత్బుల్లాపూర్ నాలుగు డివిజన్లలో సుమారు 60 వేలకు పైగా వాణిజ్య, వ్యాపార కేంద్రాలు, గృహాలు ఉన్నాయి. గ్రేటర్ అధికారులు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎర్లీ బర్డ్ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. దీంతో కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ మంగతాయారు రెవెన్యూ, బిల్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పన్నులు చెల్లించే వారికి 5శాతం రాయితీ కల్పిస్తున్నామని విస్తృత ప్రచారం కల్పించడంతో ఈనెల 13వ తేదీ వరకు సుమారు ఐదు కోట్ల రూపాయల వరకు వసూలు కావడం విశేషం. ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి ప్రత్యేకంగా రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల చివరి వారం వరకు సుమారు రూ.16 కోట్ల టార్గెట్ తో ముందుకు సాగుతున్నామని అందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

బీఆర్ఎస్ పాలనలో అప్పుల ఊబిలోకి రాష్ట్రం

రంగారెడ్డినగర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, వెంకట్రామిరెడ్డినగర్, నందానగర్‌లలో ఆయన పర్యటించి హాథ్ సే హాథ్ జోడో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి కూరుకుపోయిందన్నారు. సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై పాలనను గాలికొదిలేశాడని ఆరోపించారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంతో పాటు గ్యాస్ సిలీండర్లపై సబ్సిడీని పెంచి అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జాయింట్ సెక్రటరీ సువ్వారి శ్రీనివాస్, ఎల్లయ్య ఐఎన్‌టీయూయూసీ నాయకుడు అమర్‌బాబు, మాజీ వార్డు సభ్యుడు శివకుమార్, గురువారెడ్డి, హమ్మిరెడ్డి, ప్రవీణ్, రాజశేఖర్, రాంచందర్, సతీష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన పువ్వు



అరుదుగా పూసే ఓ పువ్వు దూలపల్లి అటవీ ప్రాంతంలో పూసింది. ఎక్కువగా ఇండోనేషియాలోని సముద్ర తీరాల్లో పూసే పుష్పం ఇక్కడ కనిపించడంతో అది చూసిన ప్రకృతి ప్రేమికులు ఫొటోలు తీశారు. ఈ పువ్వును ఫిష్ పాయిజన్, సీ పాయిజన్ పుష్పంగా పిలుస్తారని ఓ విశ్రాంత అటవీశాఖ అధికారి తెలిపారు. ఇది అరుదుగా మన దగ్గర కనిపిస్తుందని సూర్యరశ్మి వలన ఈ పువ్వు తొందరగా వాడిపోతుందని పేర్కొన్నారు.

– జీడిమెట్ల

డ్రైనేజీ లైన్ కలపడంతోనే మురికి కూపంగా తుమార్ చెరువు



తుమార్ చెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తున్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి

సుభాష్‌నగర్: బీజేపీ సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా గురువారం కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లి గ్రామంలోని తుమార్ చెరువును శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి ఆధ్వర్యంలో చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను బీజేపీ నాయకులు తొలగించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. తుమార్ చెరువుకు ఎగువన ఉన్న మల్లారెడ్డి యూనివర్సిటీ, ఇతర విద్యా సంస్థల నుంచి నేరుగా తుమార్ చెరువులోకి డ్రైనేజీ లైన్‌ను కలిపారన్నారు. దీంతో తుమార్ చెరువు నేడు మురుగుకూపంగా మారిందన్నారు. ఈ విషయమై ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీజేపీ చేపట్టిన తుమార్ చెరువు శుభ్రత కార్యక్రమంలో దూలపల్లి గ్రామస్తులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతల నర్సింహ, సత్యనారాయణ, బూర్గుబాయి అశోక్, నర్సింగరావు, గుర్రాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి పరిచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో నిజాంపేట్ పరిధిలో చేపడుతున్న రోడ్లు, నాలాల నిర్మాణం, డ్రైనేజీ లైన్‌లు, ఓపెన్ జిమ్‌లు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయాలని మేయర్ ఆయా విభాగాల అధికారులకు సూచించారు.

◆ ఈనెల 15, 16 తేదీల్లో బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని మేయర్ నీలారెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగారాయ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నీలోఫర్ హాస్పటల్ వారి సౌజన్యంతో శనివారం సోమయ్యనగర్‌లోని ఎంకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సీఐ సైదులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం కానిస్టేబుల్ నరేష్ ఫోన్ నం .8328335047కు చేయాలని కోరారు.

‘బీజేపీ హఠావో దేశ్ బచావో’ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నిజాంపేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. ఏప్రిల్ 14 నుంచి మే 14వ తేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాల్లో ×బీజేపీ హఠావో దేశ్ బచావో׳కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం బాచుపల్లిలో జరిగిన కార్యక్రమంలో సదరు కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. నెల రోజుల పాటు సీపీఐ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. లక్షమందితో కొత్తగూడెంలో ముగింపు కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, దుర్గన్న, అంజయ్య , రామస్వామి, లక్ష్మి, మధు, కృష్ణ, రాజు, సూరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీలు

జగద్గిరిగుట్ట: బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సీపీఐ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ×బీజేపీ హఠావో దేశ్ బచావో׳పేరుతో ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం జగద్గిరిగుట్ట కార్యాలయంలో ఆవిష్కరించారు.



జీడిమెట్ల పోలీసులకు రివార్డులు



జీడిమెట్ల: ప్రాణాలకు తెగించి చాకచక్యంగా కరడుగట్టిన అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకున్న జీడిమెట్ల పోలీసులను గురువారం బాలానగర్ డీసీపీ అభినందించి రివార్డులను అందజేశారు. ఈనెల 10వ తేదీన మహారాష్ట్రకు చెందిన ఐదుగురు దోపిడీ దొంగలు జీడిమెట్లకు చేరుకున్నారు. షాపూర్ నగర్‌లోని మార్కెట్‌లో జ్యువెలరీ షాపులలో దొంగతనం చేసేందుకు రెక్కీ నిర్వహించారు. ఈ విషయంపై సమాచారం అందడంతో జీడిమెట్ల పోలీసులు అలర్ట్ అయ్యారు. వారి వద్ద తుపాకులు, కత్తులు ఉన్నట్లు కూడా తెలుసుకున్నారు. వీరు కరడుగట్టిన దొంగలు అని, ఎవరైనా అడ్డువస్తే కచ్చితంగా మట్టుబెట్టే గ్యాంగ్ అనే సమాచారం అందింది. ఈ నేపథ్యంలో జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఓ టీమ్‌ను ఏర్పాటు చేశారు. అందులో సీఐ పవన్, ఎస్సైలు మన్మద్, హరీష్, సతీష్‌రెడ్డిలతో పాటు కానిస్టేబుళ్లు రవి, అంజయ్య, ప్రభాకర్, రాజశేఖర్, లక్ష్మణ్, ప్రభాకర్ ఉన్నారు.

◆ దీనిపై సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జీడిమెట్ల పోలీసులకు అభినందించిన ఆయన డీసీపీ శ్రీనివాస్‌రావు, ఏసీపీ గంగారాంతో కలిసి గురువారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో జీడిమెట్ల ఠాణాకు చెందిన పోలీసులతో పాటు మరో ఇద్దరు ఎస్‌వోటీ పోలీసులకు డీసీపీ రివార్డులను అందజేసి అభినందించారు.

ఇలా పట్టుకున్నారు..

ఐదుగురు దొంగల కదలికలను ముందుగానే గమనిస్తున్న పోలీసులు 11వ తేదీన రాత్రి బిర్యానీ తీసుకెళ్లడానికి బయటకు వచ్చిన ఓ దొంగను ముందుగానే పట్టుకున్నారు. లోపల ఎంతమంది ఉన్నారు వారి వద్ద ఆయుధాలు ఏమేమి ఉన్నాయో పట్టుకున్న దొంగ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ప్లాన్ ప్రకారం షాపూర్‌నగర్‌లో దొంగలు మాటువేసిన ఓ పాడుబడ్డ ఇంటి వద్దకు పోలీసులు చేరుకున్నారు. వారి వద్ద తుపాకులు ఉన్నాయని తెలుసు కాబట్టి పోలీసులంతా బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌లు వేసుకున్నారు. చాకచక్యంగా ప్లాన్ ప్రకారం దొంగలు పారిపోకుండా మాటు వేశారు. ఒక్కసారిగా పోలీసులు అటాక్ చేసి ఐదుగురు కరడుగట్టిన దొంగలను అదుపులోకి తీసుకున్నారు.